క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కడప రూరల్ : లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం కోసమే విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని స్థానిక బుద్ద టౌన్ షిప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక టౌన్ షిప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2017లో లేఔట్ నిర్మాణం చేపట్టిన తరువాత 180 ప్లాట్లకు గాను 3 కేబుల్యా చొప్పున రెండు 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయగా వాటిని 2023లో ఏపీఎస్పీడీసీఎల్ వారికి హ్యాండ్‌ఓవర్ చేయడం జరిగిందన్నారు. కాలానుగుణంగా 80 శాతం ఇంటి నిర్మాణాలు పూర్తి కావడంతో లోడ్‌కు సరిపడా కేపాసిటీ లేకపోవడంతో లో ఓల్టేజ్ సమస్య ఏర్పడిందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సంతకాల సేకరణ



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడానికి నిరసిస్తూ నగరం ఐటీఐ సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతాంగం ప్రజల ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు కామనూరు శ్రీనివాసుల రెడ్డి, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌కు నామినేషన్ దాఖలు

కడప సెవెన్‌రోడ్స్ : మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా కార్పొరేటర్లు ఆర్.బాలస్వామిరెడ్డి, ఎస్.వాణి, ఎస్.మగ్బూల్‌బాషా బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకా సురేష్, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు తగవు



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు తగవని, వీటిని సత్వరమే అరికట్టాలని ప్రచార ప్రముఖ్ భయ్యా వాసు డిమాండ్ చేశారు. బాంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి సెవెన్ రోడ్స్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఇస్కాన్ స్వామి చిన్మయ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బారాయుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, బాలకృష్ణ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు



ఓటుహక్కు వినియోగించుకుంటున్న రైల్వే ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే కార్మికుల గుర్తింపు ఎన్నికలు కడప నగరంలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య ఎంప్లాయిస్ సంఘ్ ఈ ఎన్నికల్లో నిలిచాయి. కడపలో 347 మంది ఓటర్లు ఉండగా తొలిరోజు 211 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. గురు, శుక్ర వారాల్లో కూడా పోలింగ్ కొనసాగనుంది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘటనలు తలెత్తకుండా అధికారులు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా సుబ్బారెడ్డి వ్యవహరించగా, పోలింగ్ బూత్‌లో ఏజెంట్లుగా రవికుమార్, మల్లికార్జున, చిన్నప్ప, మహేష్ విధుల్లో పాల్గొన్నారు.

వస్త్రదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ప్రేమాలయ ఆశ్రమంలో ఉంటున్న వారికి బుధవారం దాతలు వస్త్రదానం చేశారు. దాతల సహకారంతో స్థానిక ప్రముఖులు ఉదయభాస్కర్ ఆశ్రమంలోని వారికి చీరలు, లుంగీలు, టవళ్లు అందజేశారు. అనంతరం ఆశ్రమ వాసులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆ నలుగురు..!

కాలే కడుపులు.. చెదిరిన బతుకులు.. కొడిగట్టిపోతున్న జీవితాలకు వారు ఆధారమవుతున్నారు. అనాథ మృతులకు 'ఆత్మ'బంధువులై దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. మానవత్వం పరిమళించే మంచి మనసున్న హిమవర్షిణి ఫౌండేషన్, మేము సైతం సేవాసంస్థ, శ్రీకాశీ విశ్వ నాథసేవా సమితి సభ్యులు ఆపన్నులెందరికో మేమున్నామంటూ ధైర్యాన్ని ఇస్తున్నారు.



శ్రీ కాశీవిశ్వనాథసేవాసమితి ఆధ్వర్యంలో అనాథమృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సభ్యులు

- అనాథ మృతదేహాలకు ఆత్మ బంధువులు
- సమాజ సేవే లక్ష్యం
- అన్నార్థుల ఆకలి తీర్చుతున్న స్వచ్ఛంద సంస్థలు

కడప అర్బన్ : దీనస్థితిలో ఉన్నవారికి మూడు పూటలా అన్నం పెట్టి ఆశ్రయం కల్పించడం, అనాథలుగా మిగిలి తనువును చాలించిన వారికి ఆప్త బంధువులుగా సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తూ హిమవర్షిణి ఫౌండేషన్ సభ్యులు మానవ సేవే మాధవ సేవగా భావిస్తున్నారు. నిరుపేదలకు అన్నదానం చేస్తూ మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు.

15 సంవత్సరాలుగా..

15 సంవత్సరాలుగా శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి ఆధ్వర్యంలో గుర్తు తెలియని అనాథ మృతదేహాలను కులమతాలకు అతీతంగా సంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. తరువాత సామూహికంగా కాశీయాత్రకు వెళ్లి అక్కడ ఆత్మలకు శాంతిని చేకూర్చేలా పిండ ప్రదానం చేస్తున్నారు. అలాగే ఈ సేవా సమితి ద్వారా ప్రతి పౌర్ణమికి నిరుపేదలకు అన్నదానం చేస్తున్నారు.

మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో..

పరమాత్మ సేవాసంస్థ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ కానిస్టేబుల్ మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 1993 నుంచి ఇప్పటివరకు 617 మంది అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. 48 సార్లు రక్తదానం చేశారు. శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణమ్మ ఆదిభిక్షువు ఆలయం నిర్మాణం కోసం గత ఏడాది స్వచ్ఛంద పదవివిరమణ చేశారు. 25 మంది వృద్ధులకు తమ ఆశ్రమంలో పెట్టుకుని పోషిస్తున్నారు. 2011లో పరమాత్మ సేవ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.

మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో..

సమాజంలో వివిధ రకాల వృత్తులు చేస్తున్న కొంత మంది వ్యక్తులతో కలిసి 2016లో 'మేము సైతం సేవాసంస్థ'ను స్థాపించారు. ఇప్పటివరకు 300లకు పైగా అనాథమృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి తమ వంతుగా సహకరిస్తున్నారు. వేసవి కాలంలో కడప నగరంలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చుతున్నారు.



కాశీలో సామూహిక పిండ ప్రదానం చేస్తున్న శ్రీ కాశీవిశ్వనాథసేవాసమితి సేవా సమితి సభ్యులు

ఎంతో ఆనందంగా ఉంది



మన చుట్టూ తిరుగుతున్న అభాగ్యులను చూసి వారికి సేవ చేయాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం వలన ఎంతో సంతృప్తి కలుగుతోంది. మానవసేవే మాధవ సేవగా భావిస్తున్నాం.

– రెడ్డి లక్ష్మణ్, శ్రీ కాశీవిశ్వనాథ సేవాసమితి సభ్యుడు, కడప

సేవ చేయడమే ధ్యేయం



నేను ఆర్టీసీలో పని చేస్తూ పదవివిరమణ పొందాను. తరువాత సేవా కార్యక్రమాల ద్వారా జీవితాన్ని సాగిస్తున్నాను. అనాథ మృతదేహాలకు అంత్యక్రియలతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది.

– నాగుల రాంప్రసాద్, రిటైర్డ్ ఆర్టీసీ డీఎం, హిమవర్షిణి ఫౌండేషన్, కడప

సేవాకే జీవితం అంకితం



1993 నుంచి ఇప్పటి వరకు 617 ఆత్మబంధువులకు అంత్యక్రియలను నిర్వహించాం. 48 సార్లు రక్తదానం చేశాను. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను. 25 మంది వృద్ధులకు ఆశ్రమంలో సేవలు అందిస్తున్నాం.

– మలిశెట్టి వెంకటరమణ, పరమాత్మ సేవా సంస్థ, వ్యవస్థాపకులు, భాకరాపేట, సిద్ధవటం, వైఎస్‌ఆర్ జిల్లా

అభాగ్యులకు ఆశ్రయమిస్తాం..



ఆదరణ లేని అభాగ్యులకు, వృద్ధులకు, వికలాంగులకు, అంత్య దశలో ఉన్న వారికి ఆహారంతో పాటు ఆప్యాయతను పంచుతున్నాం. మా సేవాశ్రమంలో ఆశ్రయం కల్పించి కొత్త జీవితాన్ని ఇస్తాం. దాతల సహాయంతో అన్ని రకాల వసతులు సమకూర్చుతున్నాం. దాతల సహకారం మరువలేనిది.

– పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, వ్యవస్థాపకులు, వివేకానంద సేవాశ్రమం

రేపు అవగాహన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పారిశ్రామిక రంగాలను ప్రోత్సహిస్తూ కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బ్యాంకు ఆర్ఎం మురళీమోహన్ తెలిపారు. కడప నగరం శంకరాపురంలోగల ఐఎంఏ హాలులో సాయంత్రం 4 గంటలకు మెగా ఎంఎస్ఎంఈ ఔట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు ఎంఎస్ఎంఈ రుణాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కడప ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోటీల తేదీ మార్పు

కడప కల్చరల్ : బ్రౌన్ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించనున్న పోటీల తేదీలను మార్చుతున్నట్లు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ నెల 9న నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. అయితే ఆ రోజు విద్యార్థులకు పరీక్షలు ఉండడం వలన రెండు రోజుల ముందుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంటే 9న జరగాల్సిన ఈ పోటీలు 7వ తేదీకి మార్చామని, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు గమనించాలని కోరారు.

'మా' ఎగ్జిబిషన్ సేల్ పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా కడప నగరంలోని ప్రకాశ్‌నగర్ నారాయణ స్కూలు ఎదురుగా ఏర్పాటు చేసిన మా ఎగ్జిబిషన్ సేల్స్‌ను గురువారానికి పొడిగించినట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్త డిజైనర్ శారీస్, కోల్‌కతా బెనారస్, ఆర్గాంజి, జార్జెట్ కాటన్ శారీస్, కంచిపట్టు కోటా శారీస్, డ్రెస్ మెటీరియల్, బెడ్‌షీట్లు, ఫ్యాబ్రిక్స్‌తోపాటు మహిళలకు సంబంధించిన వన్‌గ్రామ్ గోల్డ్, ఇతర ఆభరణాలు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు.

మెరుస్తున్న క్రిస్మస్ తారలు

కడప కల్చరల్ : జిల్లా అంతటా క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. వారం రోజులుగా పాఠశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహిస్తున్నారు. పలు చర్చిలు, ప్రార్థనా మందిరాలకు మరమ్మతులు చేపట్టి సున్నం, రంగులు వేసి ఆకర్శణీయంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చి కమిటీలు నిర్వహణ కమిటీలతో కలిసి పండుగ నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పలు చర్చిల వద్ద, కూడళ్లలోనూ ఇప్పటికే క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేశారు. రాత్రులు ఇవి శోభాయమానంగా వెలుగులీనుతూ పండుగ రాకను తెలియజేస్తున్నాయి. క్రిస్మస్‌కు రెండురోజుల ముందు నుంచే భక్తి పూర్వక సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించేందుకు యువకులు, బాలలు జోరుగా సాధన చేస్తున్నారు. పలు చర్చిలలో ఆటల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కాంతులీనుతున్న క్రిస్మస్ స్టార్లు

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



జి. ఓబులేసు

కడప అర్బన్ : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తామని కడప చిన్నచౌక్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ జి. ఓబులేసు తెలిపారు. బుధవారం కడప చిన్నచౌక్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఓబులేసు కడప ఉమ్మడి జిల్లాలో లక్కిరెడ్డిపల్లి, ఓబులవారిపల్లి, ముద్దనూరు, ప్రొద్దుటూరు ఎస్ఐగా పనిచేశారు. 2012లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐగా ప్రొద్దుటూరు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కర్నూలు జిల్లా బేతంచెర్ల, ఆత్మకూరులో సీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తిరుమలకు డిప్యూటీ మేయర్ పాదయాత్ర

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తిరుమలకు పాదయాత్ర బృందం బయలుదేరింది. కడపలోని మహావీర్ సర్కిల్ నుంచి బయలుదేరిన బృందం ఎన్జీఓ కాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. తొలిరోజు పాదయాత్ర నగర శివారులోని ఆదిత్య కల్యాణ మండపం వరకు గోవిందనామ స్మరణల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాష, వైఎస్సార్‌సీపీ నేతలు డాక్టర్ సొహైల్, మాసీమబాబు, పులి సునీల్‌కుమార్, శ్రీరంజన్‌రెడ్డి, రెడ్డిప్రసాద్ కార్పొరేటర్లు షఫీ, పాకా సురేష్, బాలస్వామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మహిళా భక్తులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి బృందం

ఎయిడెడ్ పోస్టుల నియామకాల్లో కుంభకోణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని ఎయిడెడ్ పోస్టులు భర్తీలో భారీ కుంభకోణం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాహుల్, వీరపోగు రవి ఆరోపించారు. బుధవారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా లోని ఆర్సీఎం పాఠశాలలోని ఖాళీలను రిక్రూట్ చేయడానికి దాదాపు 35 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఎంపిక విధానాన్ని మరియు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఒక్కో పోస్టుకు రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు డబ్బులు వసూలు చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్

9న అప్రెంటిస్ మేళా

కడప ఎడ్యుకేషన్: డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈ నెల 9న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. ఐటీఐలలో శిక్షణ పూర్తిచేసి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. అప్రెంటిస్‌లో భాగంగా స్టైపెండ్ ప్రతి నెల రూ. 7,700 నుంచి రూ. 10 వేల వరకు కంపెనీ వారు చెల్లిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ రాయచోటి డిగ్రీ కళాశాలలో మూడో సెమిస్టర్ సంస్కృతం పేపర్ లీకేజి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న కోరారు. బుధవారం వైవీయూలో వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ పరీక్ష పేపర్ వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టిందని, పరీక్షను రద్దుచేశారని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత వైవీయూ అధికారులదేనన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్ తేజ, ముబారక్ బాషా పాల్గొన్నారు.



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

క్రీడా పోటీల్లో రిమ్స్ విద్యార్థుల విజయం

కడప అర్బన్ : క్రీడా పోటీల్లో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) వైద్య విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలో పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాలలో జరిగిన ఎంపికలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించిన క్రిష్టిఏ మ్యాథ్యూ (2024 బ్యాచ్), అహ్మద్ ఫయాజ్ కురిక్కల్ (2023 బ్యాచ్) ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ టీమ్‌లో స్థానం సంపాదించారు. విద్యార్థులను అడిషనల్ డీఎంఈ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ వై. విజయభాస్కర్ రెడ్డి అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అడిషనల్ డీఎంఈ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ


వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా వ్యాప్తంగా ఆప్కాస్ కింద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు అక్టోబర్ నెల వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు 4వ తేదీ వచ్చిన ఇంకా జీతాలు ఖాతాలకు జమ కాలేదని వాపోయారు. అధికారులు స్పందించి సత్వరమే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఆప్కాస్ ఉద్యోగుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. ఆనంద రావు, సుబ్బయ్య, గురువయ్య, ఓబుళరెడ్డి, హనుమంతరెడ్డి, రామకష్ణ, చలమయ్యతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి పాటు పడాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వైవీయూ గురుకులం క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంబీఏ విభాగ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని పేర్కొన్నారు. డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు వీసీ, అధ్యాపకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు లక్ష్యాన్ని సాధించలేవు

కడప ఎడ్యుకేషన్ : బెదిరింపులు, షోకాజ్ నోటీసులు లక్ష్యాన్ని సాధించలేవని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా అన్నారు. అపార్ పూర్తి చేయలేదనే కారణంగా జిల్లాలోని వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న 829 మంది హెడ్మాస్టర్లకు డీఈఓ షోకాజ్ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. బుధవారం డీఈఓ మీనాక్షిని ఎస్టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు షోకాజు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. తక్షణమే షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గురుకుమార్, చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు సాదిక్ అలీ, అట్లూరు మండల అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప నగరంలో భారీ వర్షం

- జలమయమైన రహదారులు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు

కడప ఎడ్యుకేషన్ : తుపాను ప్రభావంతో రెండు రోజులుగా చిన్నపాటి వర్షం కురుస్తుండగా బుధవారం సాయంత్రం నుంచి కడప నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో కడప నగరం ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో పెద్ద ఎత్తున నీరు నిలబడడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే నగరంలోని లోతట్టు ప్రాంతాలైన మృత్యుంజయకుంట, చిన్నచౌకు, గౌస్‌నగర్, అల్మాస్‌పేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం పాఠశాలలు వదిలే సమయంలో భారీ వర్షం కురవడంతో విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన ప్రజలు వర్షానికి అవస్థలు పడ్డారు.



హెచ్‌జీఎస్ స్ట్రీట్‌లో నిలిచిన వర్షం నీరు



వర్షానికి తడుస్తూ బైక్‌పై వెళ్తున్న ప్రయాణికులు